సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



కార్యదర్శుల పనితీరుపై ఆరా

కార్యదర్శుల పనితీరును పరిశీలించేందుకు తాళ్లకంపహాడ్, కానరబాదలను అదనపు కలెక్టర్ ప్రియాంక సందర్శించారు. - 8లో



వరద బాధితులను ఆదుకోవాలి

ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి కోరారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31°/24°

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

మద్యం టెండర్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

- కలెక్టర్ వెంకట్రావు



ఎస్సీ, ఎస్టీ, గౌడ కులస్తులకు కేటాయించాల్సిన దుకాణాలకు డ్రా తీస్తున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో మద్యం దుకాణాల టెండర్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ వెంకట్రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రిజర్వేషన్ ప్రకారం ఎస్సీ, ఎస్టీ, గౌడ కులస్తులకు కేటాయించాల్సిన మద్యం దుకాణాలను డ్రా పద్ధతి ద్వారా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 99 మద్యం దుకాణాలు ఉన్నాయని, ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఎస్సీలకు 10, ఎస్టీలకు 3, గౌడ కులస్తులకు 27 షాపులు కేటాయించడం జరిగిందని చెప్పారు. ఓపెన్ కేటగిరీలో 59దుకాణాలు కేటాయించామని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ 18వ తేదీ వరకు ఉంటుందని, 21న స్థానిక త్రివేణి ఫంక్షన్ హాల్‌లో డ్రా పద్ధతిలో షాపుల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత, ఎస్టీ, ఎస్సీ, బీసీ శాఖల సంక్షేమ అధికారులు శంకర్, అనసూర్య, దయానంద రాణి పాల్గొన్నారు.

ఆటోనగర్‌కు స్థల పరిశీలన

సూర్యాపేట రూరల్: జిల్లాలో ఏర్పాటు చేయనున్న ఆటో నగర్‌కు గురువారం సూర్యాపేట మండలం ఇమాంపేట సమీపంలోని చివ్వెంల మండలం ఉండ్రుగొండ సర్వే నంబర్లు 132, 141, 142, 150లో గల ప్రభుత్వ భూములను గురువారం కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్లు వెంకట్‌రెడ్డి, ప్రియాంకలతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉండ్రుగొండలో 32 ఎకరాల భూములు పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేసి రిపోర్టు అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వారి వెంట ఆర్డీఓ, తహసీల్దార్ ఉన్నారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు



నల్లగొండ టూటౌన్: అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎన్.భాస్కర్‌రావు, గాదరి కిషోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, రమావత్ రవీంద్రకుమార్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నోముల భగత్‌కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, సైదిరెడ్డిలు కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. రైతులకు రూ.లక్ష లోపు రుణమాఫీ చేయాలని నిర్ణయం తీసుకున్న కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రైతుకు రుణ విముక్తి

- రూ లక్షలోపు పంట రుణాల మాఫీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- జిల్లాలో 2,02,352 మందికి లబ్ధి
- ఇప్పటికే 17,796 మందికి మాఫీ అయిన రుణాలు



సూర్యాపేటలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్

భానుపురి (సూర్యాపేట): 2018 ఎన్నికల హామీలో భాగంగా సీఎం కేసీఆర్ ప్రకటించిన రైతు రుణమాఫీ ప్రక్రియ మళ్లీ ప్రారంభమైంది. విడతల వారీగా ఈ ప్రక్రియను కొనసాగించగా రూ.36వేల వరకు బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రుణాలు ఇప్పటికే మాఫీ చేస్తూ వచ్చారు. అనంతరం కరోనా, ఆర్థిక సమస్యల కారణంగా రుణమాఫీ పూర్తికాలేదు. రైతులు సైతం దీనిపై ఆశలు వదులుకున్నారు. త్వరలో సాధారణ ఎన్నికలు రానున్నాయి. ఈమేరకు ఇటీవల కేబినెట్ భేటీలో రూ.లక్ష లోపు రైతు రుణమాఫీని పూర్తి చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఈ నిర్ణయంతో రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

జిల్లాలో 2,20,148 మంది రైతులు..

వ్యవసాయ పనుల పెట్టుబడి నిమిత్తం బ్యాంకర్లు వ్యవసాయ రుణాలు అందిస్తారు. వీటిని రైతాంగం ప్రతి ఏట రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే 2018 ఎన్నికల తర్వాత సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీని చేసేందుకు కసరత్తు చేపట్టారు. 2018 డిసెంబర్ నాటికి రూ.లక్ష లోపు ఉన్న రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించారు. దీంతో రుణమాఫీకి జిల్లాలో 2,20,148 మంది రైతులను అర్హులుగా ప్రభుత్వం గుర్తించింది. వీరి రుణమాఫీకి జిల్లాలో రూ.1379.83 కోట్లు అవసరముంటుందని అధికారులు తేల్చారు.

2018 నాటికి రుణాలు తీసుకున్న వారికే..

జిల్లాలో 2018 చివరి నాటికి బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రూ.లక్ష లోపు రుణాలను మాత్రమే ప్రభుత్వం మాఫీ చేయనుంది. ఎన్నికల తరువాత మాఫీ ప్రక్రియ చాలా ఆలస్యంగా ప్రారంభమైంది. ముందుగా రూ.25 వేల లోపు రుణాలను మాఫీ చేశారు. ఆ తరువాత రూ. 50వేల లోపు రుణాల మాఫీకి ప్రభుత్వం నిర్ణయించింది. కానీ పూర్తిస్థాయిలో మాఫీ జరగకపోగా.. జిల్లాలో రూ.36వేల రుణాల వరకు మాఫీ అయ్యాయి. దీంతో జిల్లాలో 17,796 మంది రైతులకు చెందిన రూ.31.16 కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ అయ్యాయి. ఇక మిగిలిన 2,02,352 మంది రైతులకు చెందిన సుమారు రూ.1348.67 కోట్ల రుణాలు మాఫీ కావాల్సి ఉంది. మరో 45 రోజుల్లో విడతల వారీగా ఇవి మాఫీ కానున్నాయి. కాగా ప్రతి ఏటా బ్యాంకర్లు జిల్లా వ్యాప్తంగా లక్షా 40 వేల మంది రైతులకు రుణాలను మంజూరు చేస్తూ వస్తున్నారు. ఇందులో 20వేల మంది రైతులకు కొత్తగా రుణాలు ఇస్తుండగా మిగతా వారికి రెన్యువల్ చేస్తూ వస్తున్నారు. 2018 తర్వాత రుణాలు పొందిన చిన్న, సన్నకారు రైతులు కూడా తమ వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని కోరుతున్నారు.

జిల్లాలో వ్యవసాయ భూమి : 6.35 లక్షల ఎకరాలు	
రైతులు : 2.85 లక్షల మంది	రుణమాఫీకి అర్హులు : 2,20,148 మంది
ఇప్పటికే రుణమాఫీ పొందిన వారు : 17,796 మంది	
మిగిలిన రైతులు: 2,02,352	కావాల్సిన నిధులు : (కోట్లు) రూ. 1,348.67

చిన్న, సన్న కారు రైతులకు మేలు



నాకు ఎకరం 5గుంటల భూమి ఉంది. వ్యవసాయ పనుల కోసం బ్యాంక్‌లో రూ.38వేల రుణం తీసుకున్నా. ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ రుణాలు మాఫీ చేస్తామని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు మాఫీ చేస్తామని ప్రకటించడం సంతోషదాయకం. ఈ రుణ మాఫీతో చిన్న, సన్నకారు రైతులకు మేలు జరగనుంది. – బోళ్ల లక్ష్మయ్య, రైతు, అనంతారం

బీఆర్ఎస్‌లో అసంతృప్తి జ్వాల

సిట్టింగ్ ఎమ్మెల్యేలపై బయటపడుతున్న అసమ్మతి

- కొన్నిచోట్ల లోలోపల.. మరికొన్నిచోట్ల బాహాటంగానే
- దేవరకొండ ఘటనతో చర్చనీయాంశంగా ఎమ్మెల్యేల తీరు
- ప్రత్యేక ఎజెండాతో ప్రజల్లోకి వెళ్తున్న ఆశావహులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: బీఆర్ఎస్ పార్టీలో అసంతృప్తి క్రమంగా బయటపడుతోంది. పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలపై సొంత పార్టీ నేతల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కొన్ని చోట్ల లోలోపల అసంతృప్తి గూడుకట్టుకుని ఉండగా.. మరికొన్ని చోట్ల అసంతృప్తులు బహిరంగంగానే సమావేశాలు నిర్వహించి సిట్టింగ్ ఎమ్మెల్యేలపై తిరుగుబావుటా ఎగురవేస్తున్నారు. దీనికి తోడు ఆశావహులు ఎమ్మెల్యేలపై వ్యతిరేకతను ప్రచారం చేయడంతోపాటు సొంత కార్యక్రమాలతో ముందుకెళ్తున్నారు. ఇప్పటి వరకు తెర వెనుక ఉన్న అసమ్మతి గళం ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ బయటకు వస్తోంది.

ఒక్కొక్కటిగా బయటకు..

దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌కు వ్యతిరేకంగా సొంత పార్టీ నేతలు ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆయనకు టికెట్ ఇవ్వొద్దంటూ తీర్మానం చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. డిండిలో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులంతా బుధవారం సమావేశమయ్యారు. మండల నాయకులతోపాటు దేవరకొండ మున్సిపల్ చైర్మన్, మాజీ చైర్మన్ వంటి ముఖ్య నేతలు ఈ సమావేశంలో పాల్గొనడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. గతంలో కోదాడ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్‌కు వ్యతిరేకంగా అసమ్మతి నేతలు, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, నియోజకవర్గ మాజీ ఇంచార్జి కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి తదితరులు సమావేశమై అసంతృప్తి ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు సహకరించబోమని, తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా ఐక్యంగా పనిచేస్తామని తీర్మానం చేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ప్రగతి నివేదన సభలో మంత్రి కేటీఆర్.. ప్రస్తుత ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌ను 40వేల మెజారిటీతో మరోసారి గెలిపించాలని కోరడంతో తనకు ఇక అభ్యర్థిగా అవకాశం ఇవ్వరని గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేలు రాజీనామా చేశారు.

లోలోపల అసంతృప్తి సెగలు..

మునుగోడు నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని ఉప ఎన్నికలకు ముందు వ్యతిరేకించిన వారు ఇప్పుడు బహిరంగంగా వ్యతిరేకించకపోయినప్పటికీ లోలోపల రగిలిపోతున్నారు. చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ప్రస్తుతం ఎమ్మెల్యే పాల్గొనే కార్యక్రమాలకు హాజరు కావడం లేదు. ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజుతో పాటు ఆశావహులు బొల్ల శివశంకర్, కర్నాటి విద్యాసాగర్, నారబోయిన రవి తమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. నాగర్జునసాగర్‌లోనూ ఎమ్మెల్యే నోముల భగత్‌కు ఎమ్మెల్సీ కోటిరెడ్డి వర్గానికి సఖ్యత లేదు. ఇద్దరు ఒకే వేదికపై ఉన్నా పలకరించుకునే పరిస్థితి లేదు. ఈ నియోజకవర్గంలో ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో టికెట్ సంపాదించాలనే లక్ష్యంతో బుసిరెడ్డి పాండురంగారెడ్డి తన ట్రస్టు పేరుతో నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మన్నెం రంజిత్ యాదవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి కూడా ఆదే ఆలోచనతో కార్యక్రమాలు చేస్తున్నారు. నల్లగొండలోనూ అదే పరిస్థితి నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఉన్నా, తనకు టికెట్ ఇవ్వాలని కోరుతూ పిల్లి రామరాజు యాదవ్ సొంతంగా ఫౌండేషన్ పెట్టుకొని కార్యక్రమాలు చేస్తున్నారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీలో చేరిన మోత్కుపల్లి నర్సింహులు ఇటీవల ఆలేరులో జరిగిన కార్యక్రమంలో అధిష్టానం ఆదేశిస్తే ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ఎక్కడినుంచైనా పోటీ చేస్తానని ప్రకటించడం, ఎక్కడి నుంచి అనేది చెప్పకపోవడంతో చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా

సదరం క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సుదరి కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 10, 17, 24 తేదీల్లో సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 5, 9 తేదీల్లో దివ్యాంగులు మీ సేవ కేంద్రాల్లో సదరం స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న వారు మాత్రమే క్యాంపులకు హాజరుకావాలని పేర్కొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి కోరారు. వరద బాధితుల సహాయార్థం జిల్లా కేంద్రంలో గురువారం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అనేక ప్రాంతాల్లో ప్రజలు ఇళ్లు కోల్పోయారని, పంట నష్టం జరిగిందని తెలిపారు. వారికి సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు ఎలుగూరి గోవింద్, వేల్పుల వెంకన్న, ధనియాకుల శ్రీకాంత్ వర్మ, జిల్లెపల్లి నరసింహారావు, చిన్నపంగి నర్సయ్య, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బచ్చలకూరి రాంబాబు, మందడి రాంరెడ్డి, వీరబోయిన రవి, నాని తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాద యాత్రను విజయవంతం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని ఆగస్టు 6నుంచి తెలంగాణ జన సమితి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మార్జున్ చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్రను జయప్రదం చేయాలని ఆపార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గట్ల రమాశంకర్, జిల్లా అధ్యక్షుడు మాండ్ర మల్లయ్య యాదవ్, యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాబోయిన కిరణ్‌కుమార్ కోరారు. గురువారం యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించి వారు మాట్లాడారు. ఎన్నో ఆశలతో తెలంగాణ సమాజం ఏకమై తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే తెచ్చుకున్న రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రజల ఆశలను ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమయ్యారని అన్నారు. సూర్యాపేట నియోజకవర్గానికి తొలి ఎమ్మెల్యేగా ఎన్నికైన జగదీశ్‌రెడ్డి సమగ్ర అభివృద్ధికి ఏమాత్రం కృషి చేయడం లేదన్నారు. తెలంగాణ ఉద్యమకారుడిగా ప్రధాన పాత్ర పోషించిన ధర్మార్జున్ వెంట ప్రతిఒక్కరూ నడవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కంబాలపల్లి శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బంధన్‌నాయక్, పార్టీ జిల్లా నాయకులు బొడ్డు శంకర్‌గౌడ్, గోపి, మల్సూర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విధి వంచితులు !



భర్తకు అన్నం తినిపిస్తున్న పద్మ



గదిలో గొలుసుతో కట్టి బంధించబడిన శైలజ

- ఇంటిపెద్దకు పక్షవాతం, భార్యకు ఫైలేరియా, కూతురు మానసిక దివ్యాంగురాలు
- ఆ.. కుటుంబాన్ని వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు
- పూటగడవక దుర్భర జీవనం
- ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని వేడుకోలు

విధి వైపరీత్యమంటే ఇదేనేమో. పక్షవాతంతో కుటుంబ పెద్ద కదలలేని స్థితి. భార్యకు ఫైలేరియా.. ఇక కూతురు మానసిక దివ్యాంగురాలు. ఇలా వెంటాడుతున్న అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పూట గడవక జీవచ్ఛవాలుగా బతుకీడుస్తున్న ఓ కుటుంబ దీనగాథ ఇదీ. ఆలనాపాలన చూసే వారు లేక ఆపన్నహస్తం అందించాలని ఆ కుటుంబం దాతలను వేడుకుంటోంది.

కన్నీటి గాథ

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ గ్రామానికి చెందిన కంచర్ల నర్సింహాచారి వ్యవసాయ బావుల విద్యుత్ పంపుసెట్లు మరమ్మతులు చేసే మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. నాలుగేళ్ల క్రితం ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని ఎడమ కాలు విరిగిపోయింది. చికిత్సకు రూ.2లక్షలు ఖర్చు చేసినా నేటికీ విరిగిన కాలు కదపని పరిస్థితి. ఇది ఇలా ఉండగానే నెల రోజుల క్రితం కుడి కాలుకు పక్షవాతం వచ్చి మంచానికే పరిమితమయ్యాడు. ఆయుర్వేదం, హోమియోపతి అంటూ ఎన్నో ఆస్పత్రులు తిరిగి రూ.50వేల వరకు ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోయింది.

కూతురు పరిస్థితి దయనీయం..

ఇక నర్సింహాచారి కూతురు శైలజ(20)ది దారుణమైన పరిస్థితి. 15 ఏళ్ల వయసులో ఉండగా మూర్ఛవ్యాధి బారిన పడింది. క్రమం తప్పకుండా ఆస్పత్రికి తీసుకెళ్తూ ప్రతి నెలా రూ.3వేల విలువైన మందులు వాడటంతో వ్యాధి అదుపులో ఉంది. అయితే తండ్రి నర్సింహాచారి రోడ్డు ప్రమాదానికి గురికావటంతో ఆ కుటుంబం పూట గడవటమే గగనంగా మారింది. ఈ తరుణంలో కూతురు శైలజ మూర్ఛవ్యాధికి మందులు కొనడం భారంగా మారింది. నాలుగేళ్లుగా మందులు లేకపోవటంతో వ్యాధి ముదిరింది. ఒంటిపై కనీసం బట్టలు కూడా ఉంచుకునే సోయి లేకుండా మానసిక స్థితి కోల్పోయింది. తల్లిదండ్రులతో పాటు ఇంటికి వచ్చిన వారిపై దాడి చేస్తుండటంతో గొలుసులతో కట్టి ఓ గదిలో బంధించారు. గదిలోని మంచంపైనే భోజనం, కాలకృత్యాలు తీర్చుకునే దుస్థితి నెలకొంది. ఏదైనా ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తే వ్యాధిని కొంత వరకు తగ్గించ వచ్చునని, మానసిక స్థితిలో మార్పురావచ్చని వైద్యులు తెలిపారు. కూతురును ఆస్పత్రికి తీసుకెళ్లటానికి మనుషులు, చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి.

సాయం చేయాల్సిన వివరాలు

పేరు : కూరెళ్ల నర్సింహాచారి
ఖాతా నంబర్ : 20263157328
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నకిరేకల్
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్ 0015352

నరకయాతన అనుభవిస్తున్నా..



20 ఏళ్లు వచ్చినా మా కూతురు ఆరోగ్యం మెరుగుపడటం లేదు. నా భర్త బాగున్న రోజుల్లో రోజుకు రూ.500 తెచ్చేవాడు. ప్రస్తుతం ఆయన మంచానికే పరిమతం అయ్యాడు. ఖరీదైన వైద్యం చేయించ లేక, గదిలో కుమార్తె బాధ చూడలేక నిత్యం నరకయాతన అనుభవిస్తున్నా. నాతో పాటు, నా కూతురుకు అధికారులు పింఛన్ మంజూరు చేయాలి. మా కూతురును ఏదైనా ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించాలి. దాతలు స్పందించి ఆర్థికసాయం అందజేసి మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

– కంచర్ల పద్మ, కొర్లపహాడ్

అన్నీ తానై సపర్యలు చేస్తూ..

నర్సింహాచారి భార్య పద్మ ఫైలేరియా వ్యాధి బారిన పడింది. కూలి పనులకు వెళ్లేందుకు కూడా వీలు కావటం లేదు. ఫైలేరియా వ్యాధి ధ్రువీకరణ పత్రం ఉన్నా ఆమెకు పింఛన్ మంజూరు కాలేదు. నర్సింహాచారికి నెలనెలా వచ్చే ఆసరా పింఛన్ డబ్బులు, రేషన్ బియ్యంతోనే ఆ కుటుంబం దుర్భర జీవనం గడుపుతోంది. లేవలేని స్థితిలో ఉన్న భర్తకు, మానసిక స్థితి సరిగా లేని కూతురుకు అన్నీ తానై పద్మ సేవలు చేస్తూ నరకయాతన అనుభవిస్తోంది. ఎవరైనా దాతలు సహరించి ఆర్థికసాయం అందిస్తే భర్త, కూతురుకు వైద్యం చేయిస్తానని అర్థిస్తోంది.

నేటితో నీటి విడుదలకు 56ఏళ్లు పూర్తి

- 1967 ఆగస్టు 4న సాగర్ కాల్వలకు నీటిని విడుదల చేసిన ఇందిరాగాంధీ



నీటిని విడుదల చేసి మాట్లాడుతున్న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ (ఫైల్)

నాగార్జునసాగర్: రెండు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రా వరప్రధాయినీ నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కాల్వలకు నీటిని విడుదల చేసి నేటికి 56ఏళ్లు నిండాయి. కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ మానవనిర్మిత ఆనకట్టల్లో ప్రపంచంలోనే అతిపెద్దది. 1967 ఆగస్టు 4న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేసి, నాగార్జునసాగర్ ప్రాజెక్టును జాతికి అంకితం చేసింది. 1955 డిసెంబర్ 10న నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ శంకుస్థాపన చేయగా 12సంవత్సరాల అనంతరం ఆయన కుమార్తె ఇందిరాగాంధీ సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. దీంతో ఆనాడు రైతుల కళ్లలో ఆనందం తొణికిసలాడింది. కాల్వల్లో నీరు పారడంతో బీళ్లుగా ఉన్న భూముల్లో రైతులు సిరులు పండిస్తున్నారు. నాడు కటిక దరిద్రాన్ని అనుభవించిన రైతులు నేడు ఆర్థికంగా బలపడ్డారు. తాగు, సాగునీటికి కొదవలేకుండా పోయింది. నాటి నుంచి నేటి వరకు అధిక సంవత్సరాలు ఆగస్టు మాసంలోనే కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది కూడా ఎగువ కురుస్తున్న వర్షాలతో ఆగస్టు మాసంలోనే ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తారని రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

మూసీ ప్రాజెక్టుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- మూడు గేట్ల ద్వారా నీటి విడుదల

కేతేపల్లి : ఎగువ ప్రాంతం నుంచి వరద వస్తుండడంతో మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. దీంతో అధికారులు గురువారం మూడు క్రస్టు గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 5,721 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఎగువ నుంచి మూసీకి 5,427 క్యూసెక్కుల వరదనీరు వస్తుంది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 645 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 642.90 అడుగుల వద్ద ఉంది. కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు 499క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మూసీ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.92 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు వెల్లడించారు.

సముద్రం పాలైన 16.39 టీఎంసీల నీరు..

ఈఏడాది వేసవిలోనే మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో మొదటగా జూన్ 5న అధికారులు ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. నాటి నుంచి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో నిత్యం గేట్లను పైకెత్తి ఉంచుతున్నారు. జూన్ 5నుంచి నేటి వరకు మూసీ గేట్ల నుంచి మొత్తం 16.39టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

అవయవ దానం చేసిన వ్యక్తి కుటుంబానికి సన్మానం



సూరిబాబు కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

పాలకవీడు: తాను చనిపోతూ మరో నలుగురికి అవయవ దానం చేసిన పాలకవీడు మండలంలోని బొత్తలపాలెం గ్రామానికి చెందిన నర్రెడ్ల సూరిబాబు(49) కుటుంబ సభ్యులను రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు గురువారం హైదరాబాద్‌లో సన్మానించారు. వివరాలు.. నర్రెడ్ల సూరిబాబు ఏడాది క్రితం ఇంట్లో కిందపడడంతో మెదడులో రక్తం గడ్డకట్టి ప్రాణాపాయస్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యులు పరీక్షించి బ్రెయిన్ డెడ్ అయిందని నిర్ధారించారు. విషయం తెలుసుకున్న జీవన్‌దాన్ స్వచ్ఛంద సంస్థ వారు సూరిబాబు కుటుంబ సభ్యులను కలిసి అవయవ దానంపై వారికి అవగాహన కల్పించారు. దీంతో సూరిబాబు భార్య లక్ష్మి, కుమారులు నాగేశ్వరరావు, శ్రవణ్, సందీప్ అవయవ దానానికి అంగీకరించడంతో శస్త్రచికిత్స చేసి అతడి గుండె, లివర్, కళ్లు, కిడ్నీలను మరో నలుగురికి అమర్చారు. కాగా జీవన్‌దాన్ స్వచ్ఛంద సంస్థ వారు రాష్ట్ర వ్యాప్తంగా అవయవ దానం చేసిన కుటుంబాలకు గురువారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావు చేతులమీదుగా సన్మానం చేయించారు.

సెల్ టవర్ల సామగ్రి చోరీ ముఠా అరెస్ట్

కోదాడరూరల్: సెల్ టవర్లలోని సామగ్రిని చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను గురువారం కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్లకు చెందిన లక్ష్మీనారాయణ, తెలంగాణలోని వనపర్తికి చెందిన యువరాజ్ గతంలో సెల్ టవర్లలో టెక్నీషియన్‌లుగా పనిచేస్తున్న సమయంలో పరిచయమయ్యారు. కాగా వారు టెక్నీషియన్‌లుగా పని మానేసి సెల్ టవర్లలో ఉండే 4జీ, 5జీ బేస్‌బ్యాండ్ యూనిట్లను చోరీ చేసి విక్రయించుకొని డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు వారు కోదాడ, మునగాల, మహబూబ్ నగర్ జిల్లాలోని కొత్తకోట, కొల్లాపూర్, వేమూరు, గట్టు, హైదరాబాద్‌లోని బాలానగర్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామ ప్రాంతాల్లో 17 చోట్ల సెల్ టవర్లలోని బేస్‌బ్యాండ్ యూనిట్లను చోరీ చేసి వారికి పరిచయం ఉన్న హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ హానజ్‌ఖాన్‌కు విక్రయించారు.

వాహనాలు తనిఖీ చేస్తుండగా..

గురువారం రాష్ట్ర సరిహద్దు అయిన రామాపురం క్రాస్ రోడ్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. కోదాడ ప్రాంతంలో చోరీ చేసిన బేస్‌బ్యాండ్‌లను హానజ్‌ఖాన్‌కు చూపించేందుకు అతడిని లక్ష్మీనారాయణ, యువరాజ్ ఆంధ్రప్రదేశ్ వైపు నుంచి కోదాడకు తీసుకొస్తున్నారు. వారు పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి వివరాలు అడగగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నారు. అయితే దొంగిలించిన బేస్‌బ్యాండ్‌లను ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన మరో వ్యక్తికి విక్రయించినట్లు వారు పోలీసుల విచారణలో ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి ఓ బేస్‌బ్యాండ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరు చోరీ చేసిన బేస్‌బ్యాండ్ విలువ దాదాపు రూ.కోటి వరకు ఉండవచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దురాజ్‌పల్లి (సూర్యాపేట): రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్–3 సర్వీసెస్ ఉచిత శిక్షణకు జిల్లాలోని మైనారిటీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ అభివృద్ధి అధికారి శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 100 సీట్లు కేటాయించడం జరిగిందని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 6లోగా కలెక్టరేట్‌లోని శాఖా కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 73961 70502 ను సంప్రదించాలని కోరారు.

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి : మఠంపల్లి మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, పంచామృతాభిషేకం జరిపించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

• నాగారంలో విషాదం



నాగారం మండల కేంద్రంలో ఇంటి గోడ కూలి మృతిచెందిన ముగ్గురిని పోస్టుమార్టం కోసం ట్రాక్టర్‌లో తరలిస్తున్న పోలీసులు



సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలో మూడు పార్థివ దేహాలకు నివాళులర్పిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్



ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న మంత్రి జగదీష్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్నగౌడ్

హుజూర్‌నగర్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. గురువారం పట్టణంలో ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం కార్మిక చట్టాల రద్దును వెనక్కుతీసుకోవాలని, ప్రతి కంపెనీలో 8గంటల పని విధానాన్ని అమలు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రణలో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్లతో ఈనెల 9న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మహాపడావ్ ధర్నాను అన్ని కార్మిక సంఘాలు కలిసి జయప్రదం చేయాలని కోరారు. సదస్సులో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, బీఆర్‌టీయూ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు మేకల శ్రీనివాసరావు, శీలం శ్రీనివాస్, బెల్లంకొండ గురువయ్య, జడ శ్రీనివాస్, యాకుబ్, పచ్చిపాల ఉపేందర్, ఆయా సంఘాల నాయకులు జి.కరుణాకర్‌రెడ్డి, పి.రామరాజు, సీహెచ్.రాము, ఎస్.జానయ్య, ముస్తాఫా, వెంకటేశ్వర్లు, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

హుజూర్‌నగర్ : ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ (మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. గురువారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో శానిటేషన్ వర్కర్ల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాక ముందు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ నేటికీ దానిని అమలు చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారికి కనీస వేతన జీఓను అమలు చేయడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీలం శీను, నాగయ్య, శ్రీను, సుమన్, శ్రీను, కోటి, నాగరాజు, రాములమ్మ పద్మ, గోవిందమ్మ సునీత నవీన్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై ఆరా

- తాళ్ల ఖమ్మంపహాడ్, కాసరబాద గ్రామాలను సందర్శించిన అదనపు కలెక్టర్

సూర్యాపేట రూరల్ : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేసేందుకు వెరిఫికేషన్‌లో భాగంగా గురువారం మండల పరిధిలోని తాళ్ల ఖమ్మంపహాడ్, కాసరబాద గ్రామాలను అదనపు కలెక్టర్ ప్రియాంక సందర్శించారు. ఈ సందర్భంగా కార్యదర్శుల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చేసిన ప్రభుత్వ అభివృద్ధి పనులు, నర్సరీ, పల్లె ప్రకృతివనం, సెగ్రిగేషన్ షెడ్డు, వైకుంఠధామం, తెలంగాణ క్రీడా ప్రాంగణం పరిశీలనతోపాటు, గ్రామ పంచాయతీల్లో రికార్డులను తనిఖీ చేశారు. ఆమె వెంట డీపీఓ యాదయ్య, జిల్లా ఫారెస్టు అధికారి రూపేసింగ్, డీఎస్పీ నాగభూషణం, ఎంపీడీఓ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

గొర్రెల యూనిట్ల కోసం పశు వైద్యాధికారి నిర్బంధం



అర్వపల్లి పశువైద్యశాలలో డాక్టర్‌ను నిర్బంధించిన లబ్ధిదారులు

అర్వపల్లి: డీడీలు చెల్లించిన లబ్ధిదారులందరికీ వెంటనే గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలని కోరుతూ గురువారం గొర్రెల మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో అర్వపల్లిలోని పశు వైద్యశాలలో పశువైద్యాధికారిని రెండు గంటల పాటు నిర్బంధించారు. ఈ సందర్భంగా పశువైద్యశాల ఎదుట ధర్నా చేపట్టారు. మేకల పెంపకందారుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వజ్జె వినయ్‌యాదవ్ మాట్లాడుతూ కాసర్లపహాడ్, అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం తదితర గ్రామాలకు చెందిన దాదాపు 300మంది లబ్ధిదారులు గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించగా అధికారులు కేవలం కాసర్లపహాడ్‌కు 14, అర్వపల్లికి 34 యూనిట్లను కేటాయించారన్నారు. అందరికీ యూనిట్లు కేటాయించకుండా కేవలం అర్వపల్లి, కాసర్లపహాడ్‌లకు మాత్రమే ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కాంచాని భద్రయ్య, లబ్ధిదారులు గుడిపాటి సత్తయ్య, జడ వెంకన్న, వల్లమ్మ, జడ శ్రీను, గుడిపాటి వెంకన్న, జడ నర్సయ్య, అవిలమ్మ, జయమ్మ, సుజాత, లింగయ్య, వెంకమ్మ, భాస్కర్ పాల్గొన్నారు.

సహకార సంఘం రికార్డుల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

చిలుకూరు: చిలుకూరులోని ప్రాథమిక సహకార సంఘాన్ని గురువారం రాష్ట్ర సహకార బ్యాంక్ అధికారులు సందర్శించారు. ఈసందర్భంగా సహకార బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ పద్మావతి రికార్డులు, రైతులకు ఇచ్చిన లోన్లు, స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. సంఘం రికార్డుల పనితీరు, సంఘం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏజీఎం రవికుమార్, సీనియర్ మేనేజర్ భూపతి, అసిస్టెంట్ మేనేజర్ జరినా, జిల్లా సహకార బ్యాంక్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, కోదాడ బ్రాంచ్ మేనేజర్ సుధాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ రఫీ, చిలుకూరు పీఏసీఎస్ చైర్మన్ అలసకాని జనార్దన్, సీఈఓ చిలువేరు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న చంద్రశేఖర్

మునగాల(కోదాడ): ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొంత కాలంగా నిలిచిన బదిలీలు, పదోన్నతులపై ప్రభుత్వం తక్షణమే కార్యాచరణ ప్రకటించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం మునగాల మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదును స్థానిక మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాసాని నాగేశ్వరరావు, మేకల మధుబాబు ఆధ్వర్యంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామలింగారెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి పప్పుల వీరబాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కట్కూరి మధుసూదన్‌రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు తీగల నరేష్, మండల అసోసియేట్ అధ్యక్షుడు పందిరి రవీందర్‌రెడ్డి, నడిగూడెం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి గోపిరెడ్డి, బాణోతు నాగేశ్వరరావు, గరిడేపల్లి, కోదాడ మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎర్ర కృష్ణారెడ్డి, అంకులయ్య, మండల నాయకులు పాల్గొన్నారు.